www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
15 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 287

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## పసిడి పరుగులు

- బంగారం ధరలు చుక్కలు
- ప్రతి రోజూ పరుగులు
- రూ. 1.25 లక్షలు దాటేసింది
- బంగారం అంతా సూపర్నోవాలు
- 6వేల సం" క్రితం ఉపయోగంలోకి
- హిరణ్య గా సూచిస్తాయి

02



## గెలిచి రా తల్లీ!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక
ప్రతిష్టాత్మకంగా రాజకీయ పార్టీలు
మాగంటి సునీత గోపీనాథ్ పోటీ
కేసీఆర్ బీఫామ్ అందజేశారు
రూ. 40 లక్షల చెక్కు కూడా
గెలుపే లక్ష్యంగా పావులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికను అన్ని రాజకీయ పార్టీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాగంటి సునీత గోపీనాథ్ పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు బీఆర్ఎస్ వ్యూహరచన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతకు బీఆర్ఎస్ టికెట్ కేటాయించింది. ఇప్పటికే మాగంటి సునీత తన ముగ్గురు పిల్లలతో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఎన్నికల సంఘం ఈనెల 13న నోటిఫికేషన్ విడుదల చేయడంతో పార్టీ అధినేత కేసీఆర్ మాగంటి సునీత గోపీనాథ్‌కు బీఫామ్ అందజేశారు.అలాగే ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరఫున రూ. 40 లక్షల చెక్కును సైతం అందజేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రధాన రాజకీయ పార్టీలు జూబ్లీహిల్స్ నియోకవర్గంలో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. బీఆర్ఎస్ కూడా జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తుంది. అయితే తాజాగా బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని ప్రకటించింది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సతీమణి సునీతను తమ పార్టీ అభ్యర్థిగా ఖరారు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అన్ని రాజకీయ పార్టీల కంటే బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుంది.మాగంటి సునీత ఆమె ముగ్గురు పిల్లలతోపాటు బీఆర్ఎస్ నేతలు భారీగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే.ఈ క్రమంలో మంగళవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాగంటి సునీతకు బీఫామ్ అందజేశారు.బీఫామ్‌తోపాటు ఎన్నికల ఖర్చు నిమిత్తం రూ.40 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో దివంగత మాగంటి గోపీనాథ్ కూతుళ్లు కుమారుడు, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇప్పటికే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో

మిగతా 2లో..

# సుప్రీం కోర్టుకు రేవంత్ సర్కార్

**తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు**

బీసీ రిజర్వేషన్ల వ్యవహారం
సుప్రీంను ఆశ్రయించనున్న ప్రభుత్వం
జీవో నంబర్ 9పై త్వరగా విచారణ
స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు
ప్రాథమిక దశలోనే వాదనలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై స్టే విధిస్తూ తెలంగాణ హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడమే తమ లక్ష్యమని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బీసీ రిజర్వేషన్ల స్టే విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులకు సంబంధించిన ఆర్డర్ కాపీ అందిన తర్వాత మంత్రివర్గ సహచరులతో, న్యాయనిపుణులతో చర్చించిన తర్వాత సుప్రీం కోర్టును ఆశ్రయించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ రెండు, మూడు రోజుల్లో సుప్రీం కోర్టులో విచారణకు వచ్చే అవకాశం ఉంది.

తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు ఉత్తర్వుల పూర్తి కాపీ శుక్రవారం రాత్రి అందుబాటులోకి వచ్చింది. ఇందులో తాము ఎన్ని

మిగతా 2లో..



***"రాష్ట్రంలో సమగ్ర సర్వే నిర్వహించి, కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించినట్టుగా ప్రభుత్వం వాదనలు వినిపించింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఆ ప్రక్రియలో జోక్యం చేసుకోవద్దని కూడా తెలిపింది. అయితే ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల అంశంపై వాదనలు ప్రాథమిక దశలోనే ఉన్న నేపథ్యంలో గతంలో రాహుల్ రమేశ్‌వాఘ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆధారపడుతున్నాం. రిజర్వేషన్ల అంశంపై ట్రిపుల్ టెస్ట్‌ను పాటించపోతే... స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసే పరిస్థితి లేకుండా, పెంచిన దామాషా సీట్లను ఓపెన్ కేటగిరీ సీట్లుగా నోటిఫై చేసి ఎన్నికలు నిర్వహించాలి. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని భావించడం లేదు. రిజర్వేషన్ల పెంపు జీవోను నిలిపివేసినందున ఆ మేరకు మార్పు మాత్రమే సూచిస్తున్నాం" అని హైకోర్టు తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.***





## రాహుల్ అస్త్రాన్ని కాంగ్రెస్‌పైనే ప్రయోగించిన కేటీఆర్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమరం
- తెలంగాణ రాజకీయం వేడెక్కింది
- పార్టీల మధ్య మాటల యుద్ధం
- కేటీఆర్ తీవ్ర విమర్శలు చేస్తున్నారు
- సర్కార్ ఓటు చోరీకి పాల్పడుతుంది
- ఒకటే ఇంట్ల 43 దొంగ ఓట్లు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమరం మొదలవడంతో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతుంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్... సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడం ద్వారా గ్రేటర్‌లో తమ పట్టును నిరూపించుకోవాలని చూస్తుంది. ఈ క్రమంలోనే దివంగత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతను బరిలో దింపిన బీఆర్ఎస్... ఆమె గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తుంది. మాజీ మంత్రులు,

మిగతా 2లో..

## కేసీఆర్ ఫోటో అవసరం లేదు

రాజకీయాలు మళ్లీ హీట్
కల్వకుంట్ల కవిత సంచలనం
యాత్ర చేపట్టనున్నట్లు ప్రకటన
అక్టోబర్ చివరి వారంలో
కేసీఆర్ ఫోటో లేకుండా యాత్ర
నేడు అధికారిక పోస్టర్ విడుదల
జయశంకర్ ప్రతిభా చిత్రంతో

02





## మీకు నా గతే పడుతుంది.!

02

## వనం వదిలి జనంలోకి

**కష్టాల్లో మావోయిస్టు ఉద్యమం**




02

## ఏపీ-తెలంగాణ మధ్య మళ్లీ పంచాయితీ

తెర పైకి బనకచర్ల వివాదం
ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం
ఏపీ ప్రభుత్వాన్ని నిలువరించాలి
కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ విజ్ఞప్తి
వెనక్కి తగ్గని ఏపీ సర్కార్
ఏపీ టెండర్ నోటిఫికేషన్ జారీ

02



# గెలిచి రా తల్లీ!

( మొదటిపేజీ తరువాయి )

బీఆర్ఎస్ అభ్యర్థి అయిన మాగంటి సునీతను గెలిపించాలని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ప్రజల కోసం ఎన్నో మంచి పనులు చేసిన గోపినాథ్ కుటుంబానికి జూబ్లీహిల్స్ ప్రజలు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొంటున్న సంగతి తెలిసిందే. అంతేకాదు పార్టీ కార్యకర్తలతో వరుస సమావేశాలు అవుతున్న సంగతి తెలిసిందే. జూబ్లీహిల్స్ నుంచి ఎమ్మెల్యేగా ఉన్న బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ ఆకస్మిక మరణంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. మాగంటి గోపినాథ్ జూన్ 8వ తేదీన మరణించిన సంగతి తెలిసిందే. ఇకపోతే జూబ్లీహిల్స్ నుంచి మాగంటి గోపినాథ్ వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తొలిసారి 2014లో టీడీపీ తరపున పోటీ చేసి విజయం సాధించగా... రెండేళ్ల తర్వాత బీఆర్ఎస్ గూటికి చేరారు. ఆ తర్వాత 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి బరిలో నిలిచి గెలుపొందారు. దీంతో బీఆర్ఎస్ పార్టీకి జూబ్లీహిల్స్ బలమైన స్థానంగా ఉంది. ప్రస్తుతం తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్‌కు జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవడం రాజకీయంగా చాలా కీలకం అనే చెప్పాలి. ఈ క్రమంలోనే పలు అంశాలను పరిగణనలోకి తీసుకున్న బీఆర్ఎస్ అధిష్టానం మాగంటి గోపినాథ్ సునీతను తమ పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. ఇప్పటికే మాగంటి సునీత, ఆమె ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఇంటింటికి తిరుగుతూ ప్రజలను కలుస్తున్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

**విశాలభారతి, నర్సంపేట:**

నర్సంపేట బీసీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ సత్యశారద మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, స్టాఫ్ వివరాలు, పలు రికార్డులు, వంటగది, మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కామన్ డైట్ మెనూను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ రాత్రి భోజనం చేశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే కంప్లైంట్ బాక్స్‌లో రాసి వేయాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై వసతి గృహ సంక్షేమ అధికారి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

# కేసీఆర్ ఫోటో అవసరం లేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా "యాత్ర" చేపట్టనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ యాత్రను అక్టోబర్ చివరి వారంలో ప్రారంభించనున్నట్లు సమాచారం. అందులో భాగంగా ప్రతి జిల్లాలో ప్రజలతో ప్రత్యక్షంగా కలవడం, వారి సమస్యలు తెలుసుకోవడం.. తెలంగాణ ఆత్మను మరోసారి గుర్తు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ యాత్రలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఆమె తండ్రి కేసీఆర్ ఫోటో లేకుండా యాత్రను నిర్వహించనున్నారు. దాని స్థానంలో తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే ప్రొఫెసర్ జయశంకర్ ఫోటోను పోస్టర్లలో ఉపయోగించనున్నట్టు తెలిపారు. ఈ యాత్ర తెలంగాణ స్వరాన్ని వినిపించాలనే ధ్యేయంతో చేపట్టనున్నట్టు చెప్పుకొచ్చారు. అందులో రాజకీయాలకు స్థానం లేదని చెప్పినట్టు సమాచారం. కానీ ఈ నిర్ణయం కవిత స్వతంత్ర రాజకీయ ధోరణిని.. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.కవిత యాత్రకు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను రేపు (బుధవారం) విడుదల చేయనున్నారు. జాగృతి కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ పోస్టర్ డిజైన్ పూర్తిగా ప్రొఫెసర్ జయశంకర్ ప్రతిభా చిత్రంతో, తెలంగాణ మట్టివాసనతో రూపొందించనున్నట్టు చెబుతున్నారు. పోస్టర్ విడుదల అనంతరం యాత్ర షెడ్యూల్, మార్గం, ప్రారంభ స్థలం, సమావేశాల తేదీలను కూడా వెల్లడించనున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల మీదుగా ఈ యాత్ర కొనసాగనుంది. యాత్రలో భాగంగా పల్లెలు, పట్టణాలు, విద్యాసంస్థలు, సాంస్కృతిక కేంద్రాలను కవిత సందర్శించనున్నారు. ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యార్థి సమాఖ్యలు, సామాజిక సంస్థలతో ఆమె సమావేశాలు నిర్వహించనున్నారు. అలానే తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో చోటుచేసుకున్న మార్పులు, సాధించిన విజయాలు, ఇంకా చేయాల్సిన పనులపై ఈ యాత్రలో చర్చ జరగనున్నట్టు భావిస్తున్నారు. ఇక ఇటీవల పలు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలతో కవిత సమావేశమయ్యారు. వారి సూచనలు తీసుకుంటూ, తెలంగాణ భవిష్యత్తు, బీసీ అభివృద్ధి, మహిళా సాధికారత వంటి అంశాలపై చర్చించారు. కవిత యాత్ర రాజకీయపరంగా కీలక మలుపు కావొచ్చని విశ్లేషకుల అభిప్రాయం. అలానే బీఆర్ఎస్ భవిష్యత్తు కార్యాచరణల్లో కూడా ఈ యాత్ర ప్రభావితం చూపవచ్చని అనుకుంటున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర.. తెలంగాణ భవిష్యత్తుపై కొత్త చర్చలకు దారితీయడం ఖాయమని చర్చ జరుగుతోంది.

# వనం వదిలి జనంలోకి కష్టాల్లో మావోయిస్టు ఉద్యమం

- వరుస నేతలు లొంగుబాటు
- మల్లోజుల వేణుగోపాల్
- కీలక నేతగా గుర్తింపు పొందారు
- 60 మంది సన్నిహి తులతో
- కేంద్ర కమిటీలో 28ఏళ్లు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మావోయిస్టు ఉద్యమంలో కేంద్ర కమిటీలో కీలక నేతగా గుర్తింపు పొందిన మల్లోజుల వేణుగోపాల్ (అలియాస్ సోనూ) పోలీసులకు లొంగిపోయి, మావోయిస్టుల ఉద్యమానికి ఊహించని షాక్ ఇచ్చారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో 60 మంది సన్నిహితులతో పాటు ఆయన పోలీసులకు స్వయంగా లొంగిపోయారు. ఈ సంఘటనకు ముందు, ఆయన తన సోదరుడు మల్లోజుల కోటేశ్వరరావుకు రాసిన లేఖలో, మావోయిస్టు పార్టీ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తుంది. వేణుగోపాల్ భావిస్తున్నదేమిటంటే, విప్లవోద్యమాన్ని విజయవంతం చేయడానికి, బహిరంగంగా ప్రజల్లోకి వెళ్లడం తప్ప మరియే మార్గం లేదని లేఖలో ఆయన పేర్కొన్నారు. ఆ లేఖలో మావోయిస్టు పార్టీకి కొన్ని కీలక సూచనలు చేశారు మల్లోజుల. మొదట, సైన్యం తప్ప రహస్య పార్టీ లేని పరిస్థితి, అంతర్గత సంక్షోభాలు, పార్టీ కమిటీల క్రమంలో సైనిక దుస్తుల్లో ఉండే క్యాడర్ వ్యూహాలు విఫలమయ్యాయని విమర్శించారు. 2007లో బేస్ ఏరియాలు నిర్మించడంలో వ్యూహాత్మక తప్పిదాలు జరిగాయని, పార్టీ బలాన్ని ఎక్కువగా అంచనా వేస్తూ శత్రువు బలాన్ని తగ్గించకుండా చూశామని గుర్తు చేశారు. 2006 నూతన అటవీ చట్టం ప్రకారం చట్టబద్ధ పోరాటాలను విస్మరించడం, ప్రజల అవసరాలను పరిగణించకపోవడం వల్ల ఉద్యమానికి నష్టం జరిగిందని తెలిపారు. వీటిని సరిదిద్దకుండా కొనసాగితే, భవిష్యత్తులో మరిన్ని నష్టాలు తప్పవని ఆయన హెచ్చరించారు. అందుకే తాత్కాలికంగా సాయుధ పోరాటాన్ని విరమించి, ప్రజల్లోకి బహిరంగంగా వెళ్లి ఉద్యమాన్ని పునఃనిర్మించాల్సిన అవసరం ఉందని సూచించారు. తన లేఖలో కేంద్ర కమిటీలో 28ఏళ్లు, పొలిట్ బ్యూరోలో 18ఏళ్లు సభ్యుడిగా ఉన్నట్లు మల్లోజుల వెల్లడించారు. ప్రస్తుతం ఉద్యమం ఎదుర్కొంటున్న వైఫల్యాలను, భారీ నష్టాలకు నైతిక బాధ్యత వహిస్తూ యావత్ పార్టీ క్యాడర్‌కు ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పారు.

# మీకు నా గతే పడుతుంది.!

- జూబ్లిహిల్స్ ఉపఎన్నికలు
- ప్రచార వేడి మరింత పెరిగింది
- బీజేపీ అభ్యర్థిని ప్రకటించలేదు
- ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలనం
- బీజేపీ ఓడిపోవడం ఖాయం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి టార్గెట్‌గా


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ప్రస్తుతం జూబ్లిహిల్స్ ఉపఎన్నికలు హాట్ టాపిక్ గా మారాయి. అన్నిపార్టీలు ఎన్నికల్లో గెలవాలని తమదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోతున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ లు ఇప్పటికే అభ్యర్థుల్ని ప్రకటించారు. దీంతో ప్రచార వేడి మరింతగా పెరిగింది. బీజేపీ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు .ఈ క్రమంలో తాజాగా.. గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లిహిల్స్ బై పోల్ లో బీజేపీ ఓడిపోవడంఖాయమన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని టార్గెట్ గా చేసుకుని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓడిపోతే.. కిషన్ రెడ్డి బీజేపీ అగ్రనాయకత్వంకు ముఖం ఎలా చూపిస్తారని సెటైర్ లు వేశారు. కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోనే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉందని రాజాసింగ్ అన్నారు. కిషన్ రెడ్డి గారూ, జూబ్లీహిల్స్‌లో మీరు బీఆర్ఎస్‌ను గెలిపిస్తారా లేక కాంగ్రెస్‌ను గెలిపిస్తారా?.. అంటూ ఏకీపారేశారు. ఇది మీ గౌరవానికి సంబంధించిన విషయమని రాజాసింగ్ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ఎంఐఎంతో.. కిషన్ రెడ్డి.. చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారని అందుకే మజ్లీస్ అభ్యర్థిని ప్రకటించలేదన్నారు. అంతటితో ఆగకుండా, తనపై వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. "నన్ను నాశనం చేసి బయటకు పంపించారు. ఏదో ఒక రోజు మీరు కూడా కచ్చితంగా వెళ్తారంటూ కిషన్ రెడ్డిపై రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేశారు. మరోవైపు గత కొంత కాలంగా కిషన్ రెడ్డి వర్సెస్ రాజాసింగ్ ల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా.. జుబ్లిహిల్స్ బైపోల్స్ పై రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు పెనుదుమారంగా మారాయి. ఆయన గతంలో తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడు రామచందర్ రావుపై కూడా కాంట్రవర్సీగా మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజాసింగ్ వ్యవహారం బీజేపీకి పెద్ద తలనొప్పిగా మారిందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. మొదటి రోజు పది నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించగా వారు ప్రచారం కూడా నిర్వహిస్తున్నారు. అయితే జూబ్లీహిల్స్ అభ్యర్థి విషయంలో బీజేపీ ఆచితూచి అడుగులు వేస్తుంది. రాష్ట్ర పార్టీ ఇప్పటికే పార్టీ ముగ్గురి పేర్లను అధిష్టానానికి పంపగా వారిని కాదని పార్టీ బలమైన బీసీ అభ్యర్థి పేరును పరిశీలిస్తుందన్న ప్రచారం సాగుతోంది. దీంతో అనూహ్యంగా మాజీ మంత్రి మూల ముఖేష్ గౌడ్ తనయుడు, యువనేత మూల విక్రమ్ గౌడ్ పేరు తెరమీదకు వచ్చింది. ఈ సందర్భంగా పార్టీ ఎవరికి అవకాశం కల్పిస్తుందోనని అందరిలో ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో బీజేపీ బహిష్కృత నేత, సీనియర్ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి.

# రాహుల్ అస్త్రాన్ని కాంగ్రెస్‌పైనే ప్రయోగించిన కేటీఆర్

( మొదటిపేజీ తరువాయి )

ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు... ఇలా బీఆర్ఎస్ నాయకులు జూబ్లీహిల్స్‌లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావులు పార్టీ నేతలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ... మాగంటి సునీత గెలుపు కోసం పని చేయాలని పిలుపునిస్తున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ''ఓటు చోరీ''కి పాల్పడిందని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. అయితే కేటీఆర్ చేస్తున్న ఈ ఆరోపణలు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎందుకంటే... కాంగ్రెస్ అగ్రనేత గత కొంతకాలంగా కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఓటు చోరీకి పాల్పడుతుందని ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. అలాగే ప్రత్యేకంగా మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లు కూడా ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో ఓటర్ లిస్ట్‌లలో భారీగా అవకతవకలు జరిగియాని చెబుతున్న రాహుల్... పలు అంశాలను ప్రస్తావించారు. అయితే రాహుల్ ఆరోపణలను ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఖండించిన సంగతి తెలిసిందే.అయితే తెలంగాణలో అధికార కాంగ్రెస్‌పై విమర్శలు చేసేందుకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మార్గాన్నే కేటీఆర్ ఫాలో కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేటీఆర్ సోమవారం రోజున జూబ్లీహిల్స్ నియోకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ... '' ''ప్రజలు ఓట్లు వేయరని కాంగ్రెస్‌కు అర్థమైంది. ఒకటే ఇంట్ల 43 దొంగ ఓట్లు రాయించారు. మొత్తంగా వేల సంఖ్యలో దొంగ ఓట్లు రాయించారు'' అని సంచలన ఆరోపణలు చేశారు.




తాను దానిపై దృష్టి సారించామని, ఎలా ఎదుర్కోవాలనే దానిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు.

అంతేకాకుండా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు కోసం అధికార కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోందని, ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ ఓట్ చోర్ అంటుంటే... రాష్ట్రంలో ఆ పార్టీ చోర్ ఓట్లతోనే గెలవాలని చూస్తుందని సంచలన ఆరోపణలు చేశారు. అయితే కేటీఆర్ తన ఆరోపణలను మరింత తీవ్రతరం చేస్తూ మంగళవారం రోజున ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ అధిష్టానంపై కూడా ఆయన పలు ప్రశ్నలు సంధించారు. రాహుల్ గాంధీని కూడా టార్గెట్ చేసుకుని విమర్శలు గుప్పించారు. ఈ ఉప ఎన్నికల సందర్భంగా 23 వేల ఓట్లు పెరిగాయని చెప్తున్నారు... వీటితోపాటు 12,000 ఓట్లు డిలీట్ అయ్యాయని చెబుతున్నారు... అసాధారణంగా ఏ విధంగా ఓట్లు పెరిగాయి అన్నది అనేక అనుమానాలకు దారితీస్తుందని కేటీఆర్ అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉన్న వ్యక్తి ఎన్నికల కమిషన్ డ్యూటీని తన చేతుల్లోకి తీసుకొని అక్రమంగా ఓటు ఐడీలను పంచారని ఆరోపించారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థి చేసిన ఫేక్ ఐడీ కార్డుల పంపిణీ జరిగింది అని ఎన్నికల సంఘం కేసు నమోదు చేసిందని అన్నారు. ఇవన్నీ జరిగిన తర్వాతనే తమ పార్టీ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు మొత్తం వ్యవహారంలో పరిశీలన చేయడం జరిగిందని... 43 ఓట్లు ఉన్న సాంస్కృతి అపార్ట్మెంట్స్ వెళ్లి చూశామని... అక్కడ ఉన్న ఓనర్ ఆయనకు సంబంధం లేదు అని చెప్పారని చెప్పుకొచ్చారు. అలాగే ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయని... దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని ఆరోపిస్తూ పలు కేసులను ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీనే ఇవన్నీ చేయించిందని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎన్నికల అక్రమాల కోసం కిందిస్థాయి అధికారులను కాంగ్రెస్ పార్టీ ఉపయోగించుకుంటుంది అన్న అనుమానం ఉందని అన్నారు. సొంతంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ సొంత తమ్ముడి వెంకట్ ప్రవీణ్ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. ఇంతకంటే దారుణమైన పరిస్థితి ఇంకా ఎక్కడైనా ఉంటుందా? అని ప్రశ్నించారు. తాము ఎన్నికల సంఘానికి లేఖ ఇచ్చి... 24 గంటలు దాటినా ఇప్పటిదాకా ఇప్పటివరకు స్పందించలేదని చెప్పారు. మొత్తం కొత్తగా వచ్చిన 23 వేల ఓట్ల పైన సంపూర్ణ దర్యాప్తు జరపాలని... డూప్లికేట్, నకిలీ ఓట్లను వెంటనే డిలీట్ చేయాలని... ఈ ఓట్ల నమోదుకు పాల్పడిన, ఓట్ల అక్రమాలకు పాల్పడిన అధికారులు అందరిపైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించాలని కోరారు.

# ఏపీతెలంగాణ మధ్య మళ్లీ పంచాయితీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య మరోసారి నీళ్ల పంచాయితీ తెరపైకి వచ్చింది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరంబనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ముందు నుంచీ తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం తెలుపుతోంది. ఈ ప్రాజెక్టును కట్టకుండా ఏపీ ప్రభుత్వాన్ని నిలువరించాలని ఇప్పటికే పదే పదే కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ విజ్ఞప్తి చేస్తోంది. అయినప్పటికీ వెనక్కి తగ్గని ఏపీ సర్కార్.. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ముందడుగు వేస్తూనే ఉంది. ఈ క్రమంలోనే తాజాగా పోలవరంబనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించి డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) రూపొందించాలంటూ చంద్రబాబు సర్కార్ టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడం మరోసారి రెండు రాష్ట్రాల మధ్య పంచాయితీకి కారణం అయింది. ఈ నేపథ్యంలోనే పోలవరం బనకచర్ల లింకు ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా తాజాగా లేఖ రాశారు. బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ విషయంలో గతంలోనే తెలంగాణ ఫిర్యాదు చేసినట్లు ఆ లేఖలో రాహుల్ బొజ్జా గుర్తు చేశారు. ఈ ప్రాజెక్ట్ డీపీఆర్ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని అందులో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా.. నిబంధనలు, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టానికి వ్యతిరేకంగా ఈ బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపట్టకుండా చూడాలని కేంద్రాన్ని కోరారు. ఈ విషయంలో ఇప్పటికే కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులకు తెలంగాణ సర్కార్ లేఖ రాయగా.. తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి కూడా లేఖ రాయడంతో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోలవరం బనకచర్ల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. టెండర్లు, భూ సేకరణ విషయంలో చంద్రబాబు సర్కార్ ముందుకెళ్లకుండా చూడాలని కోరారు. తాజాగా ఈ టెండర్‌ను రద్దు చేయాలని సీడబ్ల్యూసీకి లేఖ రాసింది. బనకచర్ల టెండర్, సర్వే నిలిపివేయాలని విజ్ఞప్తి చేసింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును కేంద్రం ఆమోదించవద్దని కోరింది. పోలవరం డీపీఆర్‌కు విరుద్ధంగా ఈ బనకచర్ల టెండర్ ఉందని తెలంగాణ సర్కార్ ఆరోపించింది. మరోవైపు.. ఈ పోలవరం బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఈ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తాము అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు.

ఈ బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను స్వయంగా కలిసి లిఖితపూర్వకంగా తెలంగాణ తరఫున అభ్యంతరాలను వివరించినట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ.. తాము ఆల్మట్టి ఎత్తు పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని గుర్తు చేశారు. తెలంగాణకు కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాపై తాము ట్రైబ్యునల్ ఎదుట సమర్థంగా వాదనలు వినిపించామని.. ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడేది లేదని ఉత్తమ్ వివరించారు.

# పసిడి పరుగులు

**విశాలభారతి ప్రత్యేకం:**

బంగారం ధరలు చుక్కలు చూయిస్తున్నాయి. గత కొంత కాలంగా.. ప్రతి రోజూ, ప్రతి వారమూ, ప్రతి నెలా పెరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే సరికొత్త జీవన కాల గరిష్టాల్ని నమోదు చేస్తూనే ఉన్నాయి. దీంతో సామాన్యులకు బంగారం అందకుండా పోతోంది. కొద్ది రోజుల కిందట 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1 లక్ష దాటితేనే బెంబేలెత్తిపోతే.. తర్వాత 22 క్యారెట్ల గోల్డ్ జువెల్లరీ రేటు కూడా రూ. 1 లక్ష ఎప్పుడో దాటేసింది. మరో రూ. 15 వేలు కూడా పెరిగింది. దీంతో ఇప్పుడు ఆభరణాల బంగారం ధర తులం రూ. 1.14 లక్షలు దాటింది. 24 క్యారెట్ల గోల్డ్ రేటు 10 గ్రాములు రూ. 1.25 లక్షలు దాటేసింది. ఇక గత 8 వారాలుగా బంగారం ధర పెరుగుతూనే ఉంది. ఈ వారంలోనే ఏకంగా 3 శాతం వరకు బంగారం ధర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఔన్సుకు (31.10 గ్రాములు) ఈ వారమే 4 వేల డాలర్ల మార్కును దాటేసింది. 4060 డాలర్ల దగ్గర ఆల్ టైమ్ హైని నమోదు చేసింది. అంతర్జాతీయ అనిశ్చితి, రాజకీయ భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం రేటు పెరుగుతూనే ఉందని చెప్పొచ్చు. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు చూసినట్లయితే ఏకంగా 58 శాతం బంగారం ధర పెరిగింది. ఒక సంవత్సరంలో ఇంత మేర పెరగడం 1979 తర్వాత ఇదే తొలిసారి. దీంతో 46 ఏళ్ల రికార్డ్ బద్దలైందని చెప్పొచ్చు. బంగారం ధర పెరిగేందుకు చాలానే కారణాలు ఉన్నాయి. ఇక్కడ స్థూల ఆర్థిక పరిణామాలు, టారిఫ్స్ యుద్ధాలు, యూఎస్ డాలర్‌కు ప్రత్యామ్నాయంగా.. కేంద్ర బ్యాంకులు బంగారాన్ని విపరీతంగా కొనుగోలు చేస్తుండటం, యూఎస్ ఫెడ్ కీలక వడ్డీ రేట్లను తగ్గిస్తుండటం, యూఎస్ గవర్న్‌మెంట్ షట్‌డౌన్, ద్రవ్యోల్బణం పెరుగుతుండటం, ఆర్థిక అస్థిరత ఇలా ఎన్నో అంశాలు దోహదం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. చైనా నుంచి వచ్చే వస్తువులు, ఉత్పత్తులపై 100 శాతం దిగుమతి సుంకాల్ని విధిస్తానని హెచ్చరించారు. దీంతో అనిశ్చితి మరింత పెరిగింది. ఇలా ఆపద సమయంలో బంగారం సురక్షిత పెట్టుబడి సాధనంగా మారి.. డిమాండ్ పెరుగుతున్న క్రమంలో రేట్లు అంతకంతకూ పెరుగుతూ పోతున్నాయి. ఇది మరోసారి యూఎస్ చైనా ట్రేడ్ వార్‌కు దారితీస్తుందన్న భయాందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. గోల్డ్ ఈటీఎఫ్‌లలోనూ పెట్టుబడులు విపరీతంగా పెరుగుతున్నాయి. వెరసి బంగారం ధర ఇంకా పెరుగుతూ వెళ్తోంది. ఈ క్రమంలోనే బంగారం ధర ఇంకా పెరుగుతుందా అంటే అవుననే సంకేతాలే ఇస్తున్నారు నిపుణులు. యూఎస్ డాలర్ పెరుగుతున్న క్రమంలో బంగారం ధర ఇంకా ఎగబాకే అవకాశాలే ఉన్నాయని అంటున్నారు. సమీప భవిష్యత్తులో ఔన్స్ గోల్డ్ రేటు 4150 డాలర్ల వరకు చేరొచ్చని.. దేశీయంగా చూస్తే ఇది రూ. 1.27 లక్షల వరకు వెళ్లొచ్చని చెబుతున్నారు. ఇక్కడ విశేషం ఏంటంటే.. ఇజ్రాయెల్ హమాస్ సంఘర్షణ మొదలైన 2023 చివరి నుంచి.. వరుసగా 9 త్రైమాసికాలు బంగారం ధర పెరుగుతూనే వచ్చింది. ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై తన ధోరణి మార్చుకోనంత వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని భావిస్తున్నారు. బంగారం అంతా సూపర్నోవాలు (చనిపోయిన నక్షత్రాల అవశేషాలు) నుంచి వచ్చిందని చెబుతారు. భూమి ఏర్పడినప్పుడు, ఇనుము, బంగారం లాంటి భారీ మూలకాలు గ్రహం మధ్యలోకి నెట్టబడ్డాయి. అయితే, దాదాపు 4 బిలియన్ సంవత్సరాల క్రితం భూమిని భారీ ఉల్కాపాతం తాకింది. ఈ ఢీకొనటం భూమిలోకి లోతుగా వెళ్లి, బంగారం ఏర్పడటానికి కారణమైంది. కొంత బంగారం రాతి ఖనిజాలలో చిన్న కణాలుగా, లేదా వెండితో కూడిన మిశ్రమంగా కనిపిస్తుంది. భూకంపాలు కూడా బంగారం ఏర్పడటంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. లోపం రేఖ అకస్మాత్తుగా మారినప్పుడు, ఖనిజాలు ఉన్న నీరు త్వరగా ఆవిరై, రాళ్లలో క్వార్ట్జ్, బంగారు నిక్షేపాలు ఏర్పడతాయి.

పురావస్తు శాస్త్రవేత్తల ప్రకారం, మానవులు సుమారు 6,000 సంవత్సరాల క్రితం బంగారాన్ని ఉపయోగించారు.ఆభరణాలు, మతపరమైన చిహ్నాలలో బంగారాన్ని మొదట ఉపయోగించింది. ఈజిప్టు పాలకుల (ఫారోల) సమాధులలో దొరికిన బంగారు ముసుగులు, ఆభరణాలు... అప్పుడే బంగారాన్ని శక్తి, అమరత్వానికి చిహ్నంగా భావించారని సూచిస్తున్నాయి. సింధులోయ నాగరికతలో బంగారు ఆభరణాలు కనుగొనబడ్డాయి. వేదాలు, పురాణాలు బంగారాన్ని "హిరణ్య" గా సూచిస్తాయి. ఇక్కడ బంగారం శ్రేయస్సు, స్వచ్ఛతకు చిహ్నం.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బంగారం:**

బంగారం కేవలం ఆభరణాల తయారీకి మాత్రమే ఉపయోగపడలేదు. కాలక్రమేణా, ఇది వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయ్యింది. క్రీస్తుపూర్వం 600లో లిడియా (ఆధునిక టర్కీ)లో బంగారాన్ని మొదట నాణేలలో ఉపయోగించారు. మధ్య యుగాలలో యూరోపియన్ల బంగారం కోరిక అమెరికా ఆవిష్కరణ వెనుక ప్రధాన కారణంగా ఉంది. నేటికీ, డిజిటల్ కరెన్సీ, కాగితపు డబ్బు ఉన్నా, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో బంగారాన్ని 'సురక్షిత పెట్టుబడి' గా పరిగణిస్తారు.

# సుప్రీం కోర్టుకు రేవంత్ సర్కార్

( మొదటిపేజీ తరువాయి )

కల ప్రక్రియలో జోక్యం చేసుకోలేదని తెలిపింది. స్థానిక సంస్థల బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేశామని పేర్కొంది. ఈ అంశంలో వివాదాన్ని తేల్చేదాకా.. జీవో నంబర్ 9తో పాటు పంచాయతీ రాజ్ చట్టం-2018లో రిజర్వేషన్‌లను మారుస్తూ జారీ చేసిన జీవో నంబర్ 41, 42పై కూడా స్టే విధించినట్టుగా తెలిపింది. అయితే తాము పూర్తిస్థాయిలో మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని తెలిపింది. రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దని తెలిపింది. వికాస్ కిషన్‌రావ్ గవాలీ కేసులో సుప్రీంకోర్టు రిజర్వేషన్లు 50 శాతానికి మించవద్దని నిర్దేశించిందని... దీన్ని పాటించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొంది. ఈ కేసును పరిగణలోకి తీసుకుని జీవో 9, 41, 42లను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్టుగా వెల్లడించింది. అయితే గడువు తీరిన స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి పాత విధానం ప్రకారం ముందుకు వెళ్లవచ్చు. అయితే రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని తెలిపింది జీవో నంబర్ 9 జారీ చేయకముందు ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం, ఓబీసీలకు 25 శాతం మొత్తంగా 50 శాతంగా ఉన్నాయని... ఇది వికాస్ కిషన్‌రావు గవాలి కేసులో సుప్రీం కోర్టు విధించిన 50 శాతం పరిమితికి లోబడి ఉన్నాయని తెలిపింది. జీవో నంబర్ 9తో రిజర్వేషన్లు 67 శాతానికి చేరాయని పేర్కొంది. ఇప్పుడు జీవో నంబర్ 9ని నిలిపివేసినందున... పెంచిన 17 శాతం సీట్లను (బీసీలకు 25 నుంచి 42కు పెంచడం) ఓపెన్ కేటగిరీ సీట్లుగా నోటిఫై చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవచ్చుకోవచ్చని స్పష్టం చేసింది.

# ఉత్సాహవంతమైన నాయకత్వం అవసరం

- కార్యకర్తల అభీష్టం మేరకు డీసీసీ అధ్యక్షుడి నియామకం
- పారదర్శకంగా అభిప్రాయాల సేకరణ
- మంత్రి కొండా సురేఖ

**వరంగల్:**

ప్రజాస్వామ్య పద్ధతిలో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఏఐసీసీ ఇన్చార్జి నవజ్యోతి పట్నాయక్ అన్నారు. కాంగ్రెస్ వరంగల్ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి సురేఖ, ఏఐసీసీ ఇన్చార్జి నవజ్యోతి పట్నాయక్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి , ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఉత్సాహవంతమైన నాయకత్వం అవసరమన్నారు. ఇటీవల యువజన కాంగ్రెస్ ఎన్నికలు ప్రజాస్వామ్యంగా జరిగాయన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులుగా నాయిని రాజేందర్ రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ ముందుకు వెళుతున్నారని తెలిపారు. కార్యకర్తల అభీష్టం మేరకు డీసీసీ ఎంపిక నిర్ణయం ఉంటుందన్నారు. కాంగ్రెస్‌లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ పదవి ఆశించే హక్కు ఉందని.. ఎవరైనా నామినేషన్ వేయొచ్చని తెలిపారు.W

# కొలువు పత్రాలు

- తెలంగాణ గ్రూప్-2 అభ్యర్థులు
- ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది
- సెప్టెంబర్ 28న తుది ఫలితాలు
- ఈనెల 18న నియామక పత్రాలు
- అందించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఎంపికైన 783 మంది అభ్యర్థులు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గ్రూప్2 అభ్యర్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. టీజీపీఎస్సీ సెప్టెంబర్28న గ్రూప్2 తుది ఫలితాల విడుదల చేసిన టీజీపీఎస్సీ తాజాగా ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేసే అంశంపై బిగ్ అప్డేట్ ఇచ్చింది. ఈనెల 18న ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామని తెలిపింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్2 అభ్యర్థులకు ఈనెల 18 తేదీన సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. 18 తేదీ సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సీఎస్ కే రామకృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూప్ 2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందిస్తారని సీఎస్ కే రామకృష్ణారావు వెల్లడించారు.

ఇకపోతే 783 గ్రూప్ 2 పోస్టుల భర్తీకి సంబంధించి టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే. 2024 డిసెంబరులో రాత పరీక్ష నిర్వహించింది. ఈ ఏడాది మార్చి 11న జనరల్ ర్యాంకుల జాబితాను వెల్లడించింది. ఇందుకు సంబంధించిన తుది ఫలితాలను తాజాగా విడుదల చేసింది. ఒక్క పోస్టు భర్తీ పెండింగ్‌లో ఉండగా... 782 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాను ప్రకటించింది. దసరా పండుగలోపే గ్రూప్ 2 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయాలని ప్రభుత్వం భావించింది. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అదికాస్తా వాయిదా పడింది. తాజాగా అక్టోబర్ 18న ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేయనుంది. ఈ 783 పోస్టులలో దాదాపు 16 శాఖలకు ఎంపికైన వారు ఉన్నారు. ఎంపికైన అభ్యర్థుల నియామకపత్రాలు అందజేసే కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నట్లు సీఎస్ కే రామకృష్ణారావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితో పాటు వారి కుటుంబ సభ్యులను సాయంత్రం 4 గంటల లోపు శిల్పకళా వేదికలో అనుమతించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, సాధారణ పరిపాలన, రెవిన్యూ, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున, రెవిన్యూ, హోం, జిఎడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. ఈ నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీస్ లో ఉంటారు కాబట్టి వీరికి ప్రభుత్వ సర్వీస్ పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, రిజ్వి, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీకే శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

## టాప్ బ్యాట్స్‌మెన్‌గా మెరిసిన లూనావత్ ప్రతాప్ నాయక్

- క్రికెట్ మైదానంలో సిక్సర్ల వర్షం కురిపించారు
- వైద్యుడు డాక్టర్ లూనావత్ ప్రతాప్ నాయక్
- బంచరాయితండ గర్వకారణం ప్రతాప్ నాయక్
- వైద్యుడిగా సేవలు, ఆటగాడిగా అద్భుతం

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ గర్వకారణం అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ ఆల్ జూనియర్ డాక్టర్ల క్రికెట్ టోర్నమెంట్ లీగ్లో మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ గ్రామానికి చెందిన గిరిజన లంబాడి యువకుడు డాక్టర్ లూనావత్ ప్రతాప్ నాయక్ అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. నల్గొండలో జరిగిన పోటీలో టాప్ ఆర్డర్లో ఆడిన ప్రతాప్ నాయక్ కేవలం కొన్ని ఓవర్లలోనే పది సిక్సర్లు, నాలుగు ఫోర్లు బాదుతూ 89 పరుగులు చేసి జట్టు విజయానికి కంకణం కట్టాడు. ఆయన తల్లిదండ్రులు లూనావత్ వీరు సోనా దంపతులు తమ కుమారుడి విజయంపై ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు, స్నేహితులు, సహచర వైద్యులు ఆయన ప్రతిభను కొనియాడారు. డాక్టర్ లూనావత్ ప్రతాప్ నాయక్ కేవలం వైద్య రంగంలోనే కాదు, క్రీడా రంగంలోనూ తన ప్రతిభను చాటుకుంటూ బంచరాయితండ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆయన భవిష్యత్తు విజయాలకు ప్రతి ఒక్కరూ హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నారు.



## త్వరలో రూ. 700 కోట్లు విడుదల

- నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్
- అధ్యక్షులు విక్రమ్ కుమార్
- డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని
- ఉద్యోగుల సంక్షేమంపై చర్చ

**హైదరాబాద్, విశాలభారతి:**

తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షులు విక్రమ్ కుమార్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుర్రాడి శ్రీనివాస్, కార్యదర్శి, సభ్యులకు స్వాగతం పలికి, సమావేశం ఎజెండా అంశాలను చదివి వినిపించారు. ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అధ్యక్షులు విక్రమ్ కుమార్ మాట్లాడుతూ... పీఆర్సీ 2025, పెండింగ్ బిల్లులు, హెల్త్ కార్డుల వంటి ప్రధాన డిమాండ్లపై టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారమ్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేనిరాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం జరుపుతున్న ప్రయత్నాలను, సమావేశాల పురోగతిని వివరించారు. అలాగే, ఉద్యోగుల గృహనిర్మాణ సహకార సంఘం కోసం నగర శివార్లలో గుర్తించిన స్థలాల వివరాలను సభికులకు తెలియజేశారు. ముఖ్య అతిథి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని మాట్లాడుతూ... ఆర్థిక మరియు ఆర్థికేతర డిమాండ్లపై ప్రభుత్వం దృష్టి సారిస్తున్న తీరును వివరించారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతి నెల రూ. 700 కోట్లు విడుదల చేస్తుందని సభ్యులకు తెలియజేశారు. ఈ సమావేశంలో కోశాధికారి జె. బాల్ రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు ఇ. నరేష్, ఖాలెద్ అహ్మద్, కార్యవర్గ సభ్యులు ముఖీమ్ ఖురేషి, ఎ.వి. శ్రీధర్ పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఢీకొని ఆరు గొర్రెల మృతి

**తిరుమలగిరి, విశాలభారతి :**

తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో మంగళవారం సాయంత్రం ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఆరు గొర్రెల మృతి, ఇసుక ట్రాక్టర్ అతి వేగంగా నడపడం మూలంగానే ఈ ప్రమాదం జరిగిందని గ్రామ ప్రజలు తెలిపారు. ఈ సంఘటనలో సుమారు లక్ష రూపాయల మేరకు నష్టం జరిగినట్లు ప్రజలు చెప్పారు



## జడ్పీటీసీ టికెట్‌పై లూనావత్ జ్యోతి కరుణాకర్ దృష్టి

- అభివృద్ధి పథంలో వెలుగులు
- లూనావత్ జ్యోతి కరుణాకర్
- ప్రజల హృదయాల్లో స్థానం

**కురవి, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని లూనావత్ జగ్యా తండా గ్రామానికి చెందిన లూనావత్ జ్యోతి కరుణాకర్ కాంగ్రెస్ పార్టీ తరపున కురవి మండల జెడ్పీటీసీ స్థానానికి బలమైన అభ్యర్థిగా నిలుస్తున్నారు. తండా ప్రజలతో మమేకమై, వారి అభివృద్ధికోసం కృషి చేస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించిన జ్యోతి కరుణాకర్ పార్టీ టికెట్‌కు అర్హురాలిగా పేరు పొందుతున్నారు. ప్రజా సేవే పరమార్థమని నమ్మే ఆమె విద్యా రంగంలోనూ, సామాజిక సేవలోనూ తనదైన ముద్ర వేశారు. బిఎస్సీ, ఎంఎస్సీ, ఎంఎ, బిఎడ్ వంటి ఉన్నత విద్యార్హతలతో సుసంపన్నురాలైన జ్యోతి కరుణాకర్ విద్యే గ్రామ అభివృద్ధికి మార్గమని నమ్ముతూ తండాలో బాలికల విద్య ప్రాధాన్యతపై పలు కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సౌకర్యాల మెరుగుదల కోసం నిరంతర కృషి చేస్తున్నారు. ఆమె భర్త డాక్టర్ లూనావత్ కరుణాకర్ ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులు. ఆయన గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ దంపతులు సేవే ధర్మంగా తీసుకుని ప్రజల మన్ననలు పొందారు. 2019లో సర్పంచ్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ తక్కువ ఓట్ల తేడాతో ఓటమి పాలైన జ్యోతి కరుణాకర్ ఆ తర్వాత కూడా ప్రజలతో అనుబంధం కొనసాగిస్తూ గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తూనే ఉన్నారు. రహదారులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, బలహీన వర్గాల సంక్షేమం వంటి అంశాల్లో ఆమె సక్రియంగా పాల్గొంటున్నారు. ఆమె కుటుంబం రాజకీయంగా, సామాజికంగా గొప్ప వారసత్వం కలిగినది. తాత పొట్యా నాయక్ రజాకారుల అణచివేతకు ఎదురు నిలిచి తండా స్థాపనలో ప్రధాన పాత్ర పోషించారు. ఆయన స్ఫూర్తితోనే జ్యోతి కరుణాకర్ ప్రజా సేవ మార్గాన్ని ఎంచుకున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. "తండా, ప్రజల అభివృద్ధి కోసం సమర్పణతో పనిచేయాలనే ఆత్మీయ సంకల్పంతోనే కురవి జెడ్పీటీసీ టికెట్ కోరుతున్నాను. కాంగ్రెస్ పార్టీ నాకు అవకాశం ఇస్తే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాను" అని లూనావత్ జ్యోతి కరుణాకర్ తెలిపారు. గ్రామ ప్రజలు ఆమెను నిజాయితీ, సేవా మనసుతో కూడిన నాయకురాలిగా గుర్తించి, పార్టీ ఆమెకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.



## గిరిజన ఆశ్రమ పాఠశాల సమస్యలను పరిష్కరించాలి

- పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి కార్పొరేట్ స్థాయిలో విద్యా సదుపాయాలు కల్పిస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేదని ఆయన మండిపడ్డారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల లేమి విద్యార్థుల భవిష్యత్తును చీకటిలో నెడుతోందని అన్నారు. వసతి గృహాల్లో ఫ్యాన్లు లేక, కరెంటు స్విచ్‌బోర్డులు దెబ్బతిని ఉండటం వల్ల విద్యార్థులు తీవ్రమైన వేడిని తట్టుకోలేక రాత్రంతా నిద్రలేక అవస్థలు పడుతున్నారన్నారు. పాఠశాల తరగతి గదుల్లో కూడా ఫ్యాన్ సౌకర్యం లేక విద్యార్థులు చెమటలు పట్టే పరిస్థితి నెలకొంది ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల వాసతిగృహం ఆవరణలో రాత్రివేళల్లో ఒక్క లైట్ కూడా వెలగడం లేదని, చీకటిలో విద్యార్థులు భయంతో బయటకు రాలేకపోతున్నారని తెలిపారు. మరుగుదొడ్లలో కూడా టాప్స్ పాడైపోవడంతో నీటి సౌకర్యం దాదాపు నిలిచిపోయిందని, లైట్లు లేకపోవడంతో చిన్నారులు రాత్రివేళల్లో అవస్థలు పడుతున్నారని తెలిపారు. వసతిగృహం గదులు మురికితో నిండిపోయి, దుర్వాసన వస్తోందని, పరిశుభ్రత కోసం స్వీపర్లు లేకపోవడంతో పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. మంచినీటి టాప్స్ పాడైపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇది చాలా దారుణం" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కొన్ని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు నేలపై కూర్చొని భోజనం చేయాల్సి వస్తోందని, భోజనం నాణ్యత సరిగా లేక విద్యార్థులు అర్ధాకలితో తరగతులకు హాజరవుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే గిరిజన విద్యార్థుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని, తక్షణమే అధికారులు స్పందించి పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



## సబ్సిడీపై వేరుశెనగ విత్తనాలు పంపిణీ



**మునుగోడు, విశాలభారతి:**

మండలములోని పులిపలుపుల రైతు వేదికలో ఆహార నూనెలకు జాతీయ యంత్రాంగం పథకంలో భాగంగా 100% సబ్సిడీపై వేరుశెనగ విత్తనాలను జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వము అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు తప్పనిసరిగా సాగు చేయాలని తెలియజేశారు. కపాస్ కిసాన్ యాప్ ను పత్తి పంట పండించే ప్రతి రైతు ఇన్స్టాల్ చేసుకోవాలని ,పత్తి అమ్ముకోవడానికి ఈ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని మనకు దగ్గరలో ఉన్న పత్తి మిల్లులో అమ్ముకోవచ్చు అన్నారు. స్లాట్ బుక్ తనిఖీ చేసుకొని పత్తి తీసుకు పోవాలి.అదేవిధంగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నాణ్యతా ప్రమాణాలను పాటించినట్లయితే పత్తి కి మంచి మద్దతు ధర పొందవచ్చు 8%తేమ ఉంటే 8110 రూ, ఒక క్వింటాలుకు 9% ఉంటే 8028 రూ ,10% ఉంటే 7947 రూ ,11% ఉంటే 7866 రూ ,12% ఉంటే 7785 రూ ఒక క్వింటాలకు పొందవచ్చు అని తెలిపారు..ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి వేణుగోపాల్, వ్యవసాయ అధికారి పద్మజ , మల్లేష్ , వ్యవసాయ విస్తరణ అధికారులు మాధగొని నరసింహ గౌడ్, వహీద్, యాదగిరి, నిఖిల్, వెంకటేష్ చండూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

**వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు నాయకులు,కార్యకర్తలు,డివిజన్ వాసులు**

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**


హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు మంగళవారం హైదర్ నగర్ డివిజన్ సమత నగర్ కాలనీ లోని వార్డు కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్,హైదర్ నగర్ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు,కాలనీ అసోసియేషన్ సభ్యులు,కాలనీ వాసులు,మహిళా నాయకురాళ్లు పాల్గొని కేక్స్ కట్ చేయించి బోకెలతో, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. చర్చ్ పాస్టర్లు నార్నె శ్రీనివాస రావు కొరకు ప్రార్థనలు చేశారు. అలాగే వేద పండితులు ఆశీర్వదించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

## నిరుపేద కుటుంబానికి మెరుగైన వైద్యం

**మంత్రి కోమటి వెంకటరెడ్డి ఎల్ఓసీ అందజేత**

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

తుంగతుర్తి నియోజకవర్గం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన వరిపెల్లి యాకన్నా (తండ్రి ముత్తిలింగం, లేటు) మోకాలు శస్త్రచికిత్స కోసం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిను కలిసి సంప్రదించారు. ఆత్మీయ స్పందనలో, ముఖ్యమంత్రి సహాయనిధి కింద 1,00,000 రూపాయల లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు చేయించబడింది. మంగళవారం, సెక్రటేరియట్‌లో మంత్రి యాకన్నాకు వ్యక్తిగతంగా అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలకు అండగా నిలిచే ఈ ప్రభుత్వం ఎల్లప్పుడూ మీతోనే ఉంటుంది. మంచి వైద్యం అందుకొని త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం అని అన్నారు.ఈ పరిష్కారం గుమ్మడవెల్లి గ్రామంలో నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందించడంలో ఒక ప్రతీకాత్మక దృష్టాంతం అని స్థానికులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ యూత్ నాయకులు ఎస్ కే రఫిక్ గ్రామ కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



## క్సైజ్ శాఖలో దరఖాస్తుల వెల్లువ

- నేటి వరకు 124 దరఖాస్తులు సమర్పణ
- ఎక్సైజ్ సీఐ జి చిరంజీవి

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మద్యం విక్రయ కేంద్రాల అనుమతుల కోసం దరఖాస్తుల సమర్పణ ఉత్సాహంగా సాగుతోంది. తాజాగా మరో 11 కొత్త దరఖాస్తులు అందాయని, ఇప్పటి వరకు మొత్తం 124 దరఖాస్తులు స్వీకరించబడ్డాయని ఎక్సైజ్ సీఐ జి. చిరంజీవి తెలిపారు. జిల్లాలో పోలీస్ & రెవెన్యూ శాఖల సహకారంతో మద్యం నియంత్రణ, ఆదాయ వృద్ధి రెండు దిశల్లో కూడా శాఖ కృషి చేస్తుందని తెలిపారు. ఈనెల 18వ తారీకు చివరి తేదీ దరఖాస్తుల సమర్పించడానికి, మరియు 23 వ తారీఖు నాడు ఏబి గార్డెన్లో లాటరీ ద్వారా మద్యం షాపులు కేటాయించడం జరుగుతుందని సీఐ జి. చిరంజీవి స్పష్టం చేశారు.



## జనరల్ ట్రాన్స్ఫర్ అయిన నలుగురు ఆఫీసర్‌లు

**కుషాయిగూడ, విశాలభాలతి:**

కుషాయిగూడ పోలిస్టేషన్ లో నలుగురు ఆఫీసర్ లు జనరల్ ట్రాన్స్ఫర్ అయ్యారు. పోలిస్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ భూములు, హెడ్ కానిస్టేబుల్ కరుణాకర్, కానిస్టేబుల్స్ నరసింహ, నిరంజన్ లు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కుషాయిగూడ స్టేషన్ లో బదిలీ అయిన వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సుధాకర్ రెడ్డి, వెంకన్న, సునిల్ రెడ్డి, సతీష్, విజయ్, ఏఎస్ఐలు అశోక్ రెడ్డి, గోపాల్, సుబ్బారావ్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





# హోటళ్లను తనిఖీ చేసిన కమిషనర్

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ పరిధిలో శుభ్రత ప్రమాణాలు పాటించకుండా, అపరిశుభ్రంగా ఉన్న పలు హోటల్లో మునిసిపల్ అధికారులు. శ్రీ రాఘవేంద్ర భవన్ హోటల్,ఉడిపి శ్రీకృష్ణ గ్రాండ్ హోటల్, రియల్ తందూరి రెస్టారెంట్ తనిఖీలు నిర్వహించి పలు హోటల్ యజమానులకు రూ.28 వేల జరిమానాలు విధించారు. మళ్ళీ శుభ్రత ప్రమాణాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే హోటళ్లు సీజ్ చేస్తామని హెచ్చరించడం జరిగింది.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి "బస్తీ బాట"

**GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి.**



**ఎల్బీనగర్, విశాలభారతి:**

మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని వినాయక్ నగర్ కాలనీ ఫేస్-2 లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి పాల్గొన్నారు.కాలనీలోని గృహ వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ లోడ్, లోవోల్టేజ్ సమస్యలు, వీధి దీపాల లోపాలు వంటి అంశాలను కాలనీ సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలు ప్రతిరోజు ఎదుర్కొనే విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి క్షేత్రస్థాయిలో అధికారులు నేరుగా ప్రజల మధ్యకు రావడం ఒక మంచి ప్రయత్నం అన్నారు. డివిజన్‌లోని ప్రతి కాలనీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసి, విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం అవసరం. విద్యుత్ శాఖ అధికారులు ప్రజలతో సమన్వయం చేసుకుని తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు.విద్యుత్ శాఖ నిర్వహించిన బస్తి బాట కార్యక్రమం వలన కాలనీల్లో సింగల్ ఫేస్,త్రీ ఫేస్ కరెంట్ సమస్యలను అదేవిధంగా పాత స్తంభాలు మార్చడం, కొత్త స్తంభాలు ఏర్పాటు మరయు వైర్లు ప్రమాదకరంగా ఉన్న సమస్యలు డివిజన్ ప్రజలందరూవెంటనే తెలియజేయడం వలన మరింత సమర్థవంతంగా డివిజన్ లో ఉన్న విద్యుత్ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని అన్నారు..ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ AE మిరాజుద్దీన్ ఖాద్రి, లైన్మెన్ యాదయ్య, JLM దినేష్ మరయు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు రుక్మారెడ్డి,ప్రవీణ్ గౌడ్, రవితేజ,మల్లికార్జున,మురళీధర్ రెడ్డి, సంజీవ రెడ్డి,రామ్ రెడ్డి,యాదయ్య, పద్మారావు, వెంకట్ రెడ్డి మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# 25 ఏళ్లకు చదువులమ్మ ఒడిలో పూర్వ విద్యార్థుల సందడి

**ముషీరాబాద్, విశాలభారతి:**

హైదరాబాద్,లోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ (ముషీరాబాద్‌బోరబండ)స్కూల్(APR SCHOOL) విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అక్టోబర్ 11 శనివారం నాడు ఘనంగా జరిగింది. స్కూల్ లో 19992000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత కలుసుకొని సంతోషంగా గడిపారు. పాత స్నేహితులు ఒకరినొకరు పలకరించుకుంటూ మంచీ చెడు, చర్చించుకున్నారు.ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఇన్నేళ్ల తర్వాత పాత స్నేహితులు అంతా స్కూలు ప్రాంగణంలో కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ బీవీ రమణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి సిల్వర్ జూబ్లీవేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, టీచర్లు పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. ప్రిన్సిపాల్ బీవీ రమణమూర్తి మాట్లాడుతూ గతంలో ఎదుర్కొన్న సాదక బాధకాలను వివరించారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు ఎలాంటి స్ఫూర్తిని నింపుకోవాలో సూచనలు చేశారు. పాత స్నేహితులు ఇలా ఏదో ఒక సమయంలో కలుసుకుంటూ సంతోషంగా గడిపితే మంచి బంధం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

# కొడుకు దహన కాండ చేసిన తండ్రి

**రిమాండులో ఆత్మహత్య చేసుకున్న మల్లయ్య**

**దేవరుప్పల, విశాలభారతి:**



మండల సింగరాజుపల్లి గ్రామానికి చెందిన వారాల మల్లేష్ (42) గత నెల సెప్టెంబర్ 23న సింగరాజు పల్లి గ్రామానికి చెందిన పడకండి బ్రహ్మాచారిని కర్రతో కొట్టగా బ్రహ్మాచారి చెయ్యి విరిగినందున స్థానిక పోలీస్ స్టేషన్లో పిటిషన్ ఇవ్వడంతో స్థానిక ఎస్ఐ వారాల మల్లేష్‌ను అరెస్టు చేసి అక్టోబర్ 9న గురువారం రిమాండ్ కు పంపించడం జరిగింది. మల్లేష్ కుటుంబ సభ్యులు మల్లేష్ ను విడిపించడానికి (బేలు) నిమిత్తం లాయర్ తో మాట్లాడి సాక్షుల కొరకు సంబంధిత పేపర్లతో లాయర్ కు శుక్రవారం 10న సబ్మిట్ చేయగా మరుసటి రోజు సెలవు అయినందున మల్లేష్ తనను విడిపించకపోవడం లేదని దిగులు పడి 11 శనివారం రోజున బాత్రూంలో ఉన్న బ్లీచింగ్ పౌడర్ తినడం జరిగింది. తద్వారా వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించిన సంబంధిత అధికారులు, చికిత్స పొందుతూ, ఆ రోజే మల్లేష్ మరణించడం జరిగింది. ఈ మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేక జైలు వద్ద 12 ఆదివారం రోజున ధర్నా నిర్వహించారు. తదనంతరం సంబంధిత అధికారులు అతని కుటుంబ సభ్యులకు తగిన న్యాయం చేకూరుస్తామని హామీ ఇవ్వడమైనదన్నారు. ఇదే సందర్భంలో కలెక్టర్ గారిని సందర్శించి, వారికి కూడా లెటర్ ద్వారా అన్ని విషయాలు తెలియజేశా మన్నారు. అనంతరం మార్చురీలో ఉన్న శవాన్ని పంచనామాతో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు 14 మంగళవారం రోజున హ్యాండ్ వర్ చేశారు. అనంతరం కొడుకుకు తండ్రి అయిన వారాల ఐలయ్యా తల కొరివి పెట్టి ఎట్టకేలకు దహనకాండ పూర్తి చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు భార్య హైమ మాట్లాడుతూ, తమ కుటుంబం బజారున పడిందని, తనకు ఉన్న చిన్నపిల్లలు ఇద్దరు ఆడపిల్లలకు న్యాయం చేకూర్చేలా అధికారులు సహకరించి మా న్యాయం చేకూర్చి, కుటుంబాన్ని ఆదుకోవాలని, ప్రాధేయపడ్డారు. ఈ దహన కార్యక్రమం పోలీసు బందోబస్తుతో, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొని పూర్తి చేశారు.




# నోట్ బుక్స్,బ్యాగ్స్ ఉచిత పంపిణీ

**పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి**

**చౌటుప్పల, విశాలభారతి:**

మండల పరిధిలోలలో ఉన్న వివిధ గ్రామాలలో 60 ప్రభుత్వ పాఠశాలలు,గురుకులాలు మరియు మోడల్స్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు 7630 స్కూల్ బ్యాగ్స్,లక్ష పదివేల నోట్ బుక్స్ లు విద్యార్థుల మౌలిక వస్తువులలో భాగంగా స్థానిక దివిస్ పరిశ్రమ యజమాన్యం వారు 70,18,830/_రూపాయల విలువైన నోట్ బుక్స్ మరియు బ్యాగ్స్ ను చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ,గవర్నమెంట్ స్కూలులో చదివే పేద విద్యార్థులకు దివిస్ సంస్థ నోట్ బుక్స్,బ్యాగ్స్ ను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు మీద ఈ ఖర్చుల భారం పడకుండా,విద్యార్థులు బాగా చదువుకోవాలని, తల్లిదండ్రులకు, చదువు చెబుతున్న గురువులకు మంచి పేరు తీసుకురావాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మాట్లాడుతూ దివీస్ వారు ప్రతి సంవత్సరం విద్యార్థులకు నోట్ బుక్స్,బ్యాగ్స్ పంపిణీ చేయడం వల్ల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టి ఈ మండలంలోని విద్యార్థుల భవిష్యత్తుకు వారు ముందుండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు, దివిస్ పరిశ్రమ ప్రతినిధులు,లైజన్ ఆఫీసర్ బి.కిషోర్ కుమార్,బి.గోపి,ఎస్.సాయి కృష్ణ,జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

**తొర్రూర్, విశాలభారతి:**

లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామ నర్సయ్య ఆధ్వర్యంలో మంగళవారం క్లబ్ సెక్రటరీ ముడుపు రవీందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.పట్టణ కేంద్రంలోని వందేమాతరం ఫౌండేషన్ లో బియ్యం నిత్యవసర సరుకులు, ఖానాపురం పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, పలకలు, బలపాలు, వాటర్ బాటిల్ లు, కుమ్మరి కుంట్ల పాఠశాలలో బ్యాగ్స్, ఆల్ ఇన్ వన్ పుస్తకాలు, హమాలి కూలీలకు టీ షర్ట్ లు పంపిణీ చేశారు.అంబేద్కర్ క్రాస్ రోడ్డులో అన్న ప్రసాద వితరణ, ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నప్రసాద,మందుల పంపిణీ చేసి డాక్టర్లను సన్మానం చేశారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా రామ నరసయ్య మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రతినిధుల జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిస్టిక్ జిఎంటి కోఆర్డినేటర్ లయన్ వెంకటరెడ్డి,లయన్ ఎవల్యూషన్ చైర్మన్ రేగురి వెంకన్న, ఆర్ సి దామెర సరేష్, జెడ్ సి చిదిరాల నవీన్, క్లబ్ సెక్రటరీ ముడుపు రవీందర్ రెడ్డి, క్లబ్ ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్,క్లబ్ జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్, వేముల రమేష్‌పాల్గొన్నారు.



# ధాన్యం సేకరణకు ప్రణాళిక సిద్ధం

- రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు
- ధాన్యం సేకరణలో అక్రమాలు జరిగితే క్రిమినల్ కేసులు
- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి
- అధికారులకు సూచనలు

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**




ధాన్యం సేకరణలో అక్రమాలకు తావివ్వకుండా, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా కొనుగోళ్ళు చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వర్షాకాలం పంట ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి కొనుగోలు కేంద్రాల అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, మిల్లర్స్, సివిల్ సప్లయ్ అధికారులతోఅదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వానాకాలం సీజన్ లోరైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే విషయంలోఅక్రమాలకు తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి దశలోనూ రైతులకు ఇబ్బందులు ఏర్పడకుండా సాఫీగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో 34 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, దాదాపు 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రానుందని, జిల్లాలో 6 లక్షల గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పంట విక్రయం విషయంలో రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. అధికారులు, ధాన్యం సేకరణ ప్రక్రియలో బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. అన్ని శాఖలతో పరస్పర సమన్వయం పెంపొందించుకుని వరి ధాన్యం కొనుగోళ్ళు సజావుగా జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి తప్పనిసరిగా అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేస్తూ, ఆ కేంద్రంలోనే ధాన్యం కోనుగోలు ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి కేంద్రంలోనూ తాగునీరు, తగిన నీడ వంటి కనీస వసతులు అందుబాటులో ఉండాలని, నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎఫ్ఏ క్యూ ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్యపరచాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సదస్సులో డీఎస్ఓ వనజాత, సివిల్ సప్లైస్ డీ.ఎం హరీష్, డీసీఓ సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి ఉష, వ్యవసాయ శాఖ అధికారులు, మిల్లర్స్, కొనుగోలు కేంద్రాల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**బిజెపి నాయకుడు తంగెల్ల వెంకటేష్**

**చౌటుప్పల్, విశాలభారతి:**

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి నాయకుడు తంగెళ్ల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మందోల్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలను స్థానిక బీజేపీ నాయకులు పరిశీలించారు, ఈ సందర్భంగా నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాల తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి 20వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి బూత్ అధ్యక్షుడు నెట్టు అంజయ్య,నాయకులు పరకాల జగదీష్ గౌడ్,యాట సత్తయ్య,పగిళ్ల అంజిరెడ్డి,రైతులు కాటం యాదయ్య,కాటం గోరయ్య,గంగాదేవి నరసింహ,కాటం స్వామి,మంద చంద్రశేఖర్ కొండ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ డ్రైనేజీ మరమ్మతు పనుల పరిశీలన



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పద్మావతి కాలనీలో భూగర్భ డ్రైనేజీ మాన్‌హోల్స్ కుంగిపోవడంతో, అక్కడి డ్రైనేజీ పైప్‌లైన్ దెబ్బతిని కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ మరమ్మత్తు పనులను హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీవాసులు మరియు జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...భారీ వర్షాల వల్ల దెబ్బతిన్నడ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించేందుకు జలమండలి సిబ్బంది తక్షణమే చర్యలు తీసుకుంటున్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నివారించేందుకు మరమ్మత్తు పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించాం అని పేర్కొన్నారు.

# అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కడమంచి అర్జున్

**ఆర్మూర్, విశాలభారతి:**



అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కడమంచి అర్జున్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. కామారెడ్డి జిల్లాకు చెందిన కడమంచి అర్జున్ అల్లు అర్జున్ రాష్ట్ర అసోసియేషన్లో సముచితస్థానం దక్కింది. హైదరాబాద్ లోని పార్క్ హయత్ హోటల్ లో నిర్వహించిన సమావేశంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందులో భాగంగా కామారెడ్డి జిల్లాకు అధ్యక్షుడుగా ఉన్న కడమంచి అర్జున్ రాష్ట్ర స్థాయిలో సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లాలో కడమంచి అర్జున్ విజయవంతంగా నిర్వహిస్తున్నారు. నూతనంగా ఎన్నికైన సంయుక్త కార్యదర్శిగా కడమంచి అర్జున్ కు ఐకానిక్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ నిర్మాత బన్నీ వాసులు కలసి నియామక పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా కడమంచి అర్జున్ అల్లు అర్జున్ కు మరియు అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# బాధిత కుటుంబానికి 75 కేజీల బియ్యం అందజేత

**తొర్రూరు, విశాలభారతి:**

తొర్రూరు మున్సిపాలిటీ 6వ వార్డుకు చెందిన మంగళపెల్లి బాలాజీ తండ్రి మంగళ పెల్లి కిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, మున్సిపాలిటీ 4వార్డు మాజీ కౌన్సిలర్ యమున జంపన్న పేర్ల ల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యం చెప్పి 75 కేజీల బియ్యంను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో6వ వార్డు అధ్యక్షుడు రాయిశెట్టి వెంకన్న ,జై సింగ్,పట్టణ ఉపాధ్యక్షుడు రాయి శెట్టి ఉపేందర్,మాజీ ఎంపీటీసీ ఆశయ్య,స్వామి,రిటైర్డ్ సిఐ రామస్వామి,అర్వపల్లి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




# అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం

**దేవరుప్పల, విశాలభారతి:**

మండలంలోని ధరావత్ తండా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్ వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలోపోషణ మాసం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గర్భిణీలు, తల్లులు తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషక ఆహారం ఆకు కూరలు, తాజా కూరగాయలు, పాలు, పండ్లు, ఐరన్ కాల్షియం లభించే కోడిగుడ్లు, నువ్వులు, పల్లీలు, బెల్లం, ఐరన్ కాల్షియం టాబ్లెట్స్ తీసుకోవాలి అన్నారు. తదనంతరం కిషోర బాలికలు తీసుకోవలసిన ఆహార పదార్థాలు మన ఇంట్లో తయారు చేసుకుని పల్లీలడ్డు నువ్వుల లడ్డు, అటుకులు, బెల్లం, తీసుకోవడం వలన ఐరన్ కాల్షియం అందుతుంది రక్తహీనత రాకుండా ఉంటుంది అని అన్నారు. అదేవిధంగా సెక్టార్ లోని ఉపాధ్యాయు లందరూ పాల్గొని ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు కొమ్ము మంగ, మేకపోతుల రేణుక, చింతల శ్రీలత,మరియు సెక్టర్ లోని ఉపాధ్యాయులందరూ, మరియు తల్లులు,గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# బీటీ రోడ్డును పరిశీలించిన కమిషనర్

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

పురపాలక సంఘం శంషాబాద్ పరిధిలోని రాళ్లగూడ నుండి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వరకు 18 అడుగుల వెడల్పు, 800 మీటర్ల బ్లాక్‌టాప్ రోడ్డు 49 లక్షలతో వేయడం జరిగింది ఇట్టి పనులను ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాజిద్, అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్ తో మరియు కాంట్రాక్టర్ తో కలిసి రోడ్డు పనులు పరిశీలించడం జరిగింది.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
హైదరాబాద్
బుధవారం
15 అక్టోబర్ 2025
CINEMA

# 'బాహుబలి'ని బీట్ చేసిన రిషభ్ శెట్టి



కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన కాంతార చాప్టర్ 1చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రూ.500 కోట్లను అలవోకగా దాటిన ఈ చిత్రం ప్రస్తుతం రూ.650 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ సందర్భంగా కాంతార అరుదైన మైలురాయిని అందుకుంది. ఈ సినిమా రూ.650 కోట్ల దాటడంతో బాహుబలి పార్ట్ 1 మీద ఉన్న రికార్డును ఈ సినిమా అధిగమించింది. బాహుబలి-ది బిగినింగ్ చిత్రం వరల్డ్ వైడ్‌గా రూ.650 కోట్ల వసూళ్లను సాధించగా.. ఈ రికార్డును చెరిపేస్తూ.. కాంతార రూ.675 కోట్లతో దూసుకుపోతుంది. దీంతో దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన టాప్-20 చిత్రాల్లో కాంతార 17వ స్థానానికి ఎగబాకింది. 2025లో అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాల్లో రెండో ప్లేస్ దక్కించుకుంది.

# ఓటీటీలో దుమ్ములేపుతున్న 'వార్2'



బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్, మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటించిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'వార్ 2' థియేటర్లలో ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయింది. అయితే బాక్సాఫీస్ వద్ద కొంత నిరాశ కలిగించిన ఈ చిత్రం ఓటిటీలో మాత్రం సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 9 నుండి నెట్‌ఫ్లిక్స్‌లో హిందీ, తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ చేస్తున్నారు. ఇక తాజాగా ఆర్మాక్స్ రిపోర్ట్ ప్రకారం అక్టోబర్ 6 నుండి 12 వరకు ఇండియాలో అత్యధికంగా వీక్షించబడిన చిత్రంగా 'వార్ 2' నిలిచింది. ఈ చిత్రం మొత్తం 3.5 మిలియన్ వ్యూస్ సాధించి దూసుకెళ్లిందని తెలుస్తోంది. ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్‌గా నటించగా అనిల్ కపూర్, అశుతోష్ రాణా కీలక పాత్రల్లో కనిపించారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఆదిత్య చోప్రా తన యష్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్ పై నిర్మించారు.

# శ్రద్ధాకపూర్ ఫాంటసీ సినిమా



బాలీవుడ్‌లో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ భామల్లో శ్రద్ధాకపూర్ ఒకరు. ఈ భామ హార్రర్ థ్రిల్లర్ జోనర్‌లో నటించిన స్త్రీ 2 బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. స్క్రిప్టుల ఎంపికలో ఆచితూచి వ్యవహరించే ఈ భామకు సంబంధించిన కొత్త వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. శ్రద్ధాకపూర్ ఈ సారి ఫాంటసీ సినిమాకు ఒకే చెప్పిందట. పహడ్‌పంగిర టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాకు రహి అనిల్ బర్వే దర్శకత్వం వహించనున్నాడు. ఫెమినిజం బ్యాక్ డ్రాప్ స్టోరీతో రాబోతున్న ఈ చిత్రాన్ని ఏక్తాకపూర్ తెరకెక్కించనుందని బీటౌన్ సర్కిల్ సమాచారం. పురాణం, జానపద కథల నేపథ్యంలో సాగే ఫాంటసీ నేపథ్య కథ అట. ఇండియన్ సినిమాలో ఉన్న బెస్ట్ హార్రర్ థ్రిల్లర్ ప్రాజెక్టుల్లో టాప్‌లో ఉంటుంది. తాజా టాక్ ప్రకారం రహి అనిల్ ఈ చిత్రాన్ని తుంబాడ్ యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కించాలని అనుకున్నాడట. అయితే యాక్టర్ కమ్ ప్రొడ్యూసర్ సోహమ్ షాతో వచ్చిన విబేధాల కారణంగా ఈ ఆలోచన నుంచి విరమించుకున్నాడని బీటౌన్ సర్కిల్ సమాచారం. మరి పహడ్‌పంగిరకు సంబంధించి శ్రద్ధాకపూర్ టీం నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి.

# ఊహించినంతగా ఏం జరుగలేదు



మహానటి సినిమాతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కీర్తిసురేశ్. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగుతోంది. సుదీర్ఘ కాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్న కీర్తిసురేశ్, ఆంటోనీ థట్టిల్ ఫైనల్‌గా 2024లో వివాహబంధంతో ఒక్కటయ్యారు. తన కాలేజీ రోజుల్లో లవ్ స్టోరీ గురించి చెబుతూ తాము పెళ్లి చేసుకోవడానికి 15 ఏళ్ల వెయిట్ చేశామంది.మహానటి సినిమాతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కీర్తిసురేశ్. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగుతోంది. సుదీర్ఘ కాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్న కీర్తిసురేశ్, ఆంటోనీ థట్టిల్ ఫైనల్‌గా 2024లో వివాహబంధంతో ఒక్కటయ్యారు. తన కాలేజీ రోజుల్లో లవ్ స్టోరీ గురించి చెబుతూ తాము పెళ్లి చేసుకోవడానికి 15 ఏళ్ల వెయిట్ చేశామంది.

# ముచ్చటగా మూడో బిడ్డ



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఇలియానా డి క్రూస్ ప్రస్తుతం సినిమాల కంటే తన వ్యక్తిగత జీవితంతోనే వార్తల్లో నిలుస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఆమె తన భర్త మైఖేల్ డోలన్‌తో కలిసి రెండో బిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. తొలి సంతానం కోవా ఫీనిక్స్ డోలన్ తరువాత, ఇటీవల 'కీను రాఫే డోలన్'కు జన్మనిచ్చారు. ప్రస్తుతం ఆమె విదేశాల్లో నివసిస్తూ, భర్త మైఖేల్ డోలన్‌తో కలిసి పిల్లల పెంపకంపై దృష్టి సారిస్తున్నారు. అయితే ముంబయిని చాలా మిస్ అవుతున్నానని, అక్కడి స్నేహితులు ఇచ్చిన మద్దతు, మానసిక బలం ఇప్పటికీ గుర్తు వస్తోందని ఆమె తెలిపింది. వృత్తిపరంగా ఇలియానా చివరిసారి 2024లో విడుదలైన హిందీ సినిమా 'దో ఔర్ దో ప్యార్' లో కనిపించారు. ఈ చిత్రంలో విద్యా బాలన్, ప్రతీక్ గాంధీ, సెంధిల్ రామమూర్తి ముఖ్య పాత్రల్లో నటించారు. ఆ తర్వాత ఇలియానా కొత్త ప్రాజెక్ట్‌లను ఇంకా సైన్ చేయలేదు.ప్రస్తుతం నా ప్రాధాన్యం పిల్లల పెంపకమే. వాళ్లు కొంచెం పెద్దవాళ్లు అయిన తర్వాతే కెరీర్‌పై మళ్లీ దృష్టి పెడతాను, అని ఇలియానా ఓ సందర్భంలో అన్నారు. 2023లో మైఖేల్ డోలన్‌ను వివాహం చేసుకున్న ఆమె, ఇప్పుడు ఇద్దరు పిల్లల తల్లిగా సంతోషంగా ఫ్యామిలీ లైఫ్‌ను ఆస్వాదిస్తున్నారు. "తన కుటుంబంతో గడిపే ప్రతి క్షణం ప్రత్యేకం. మాతృత్వంలో దొరికే ఆనందం మరే ఇతర అనుభవంతో పోల్చలేనిది," అని ఇలియానా స్పష్టం చేసింది. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఇలియానా తాజాగా షాకింగ్ పోస్ట్ పెట్టింది. ఇందులో బేబి బంప్‌తో కనిపిస్తూ. ఊయల సర్దుతూ తన సంతోషాన్ని అభిమానులతో పంచుకుంది. అలాగే నా కొత్త ప్రాణ స్నేహితుడు రాబోతున్నాడని రాసుకొచ్చింది. దీంతో ఆమె మళ్లీ ప్రగ్నెంట్ అని త్వరలో మరో బేబికి జన్మనివ్వబోతుందంటూ కంగ్రాట్స్ చెబుతున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఇలియానా తన రెండో గర్భధారణ అనుభవాలను పంచుకున్నారు. "మొదటి బిడ్డ పుట్టినప్పుడు ప్రతి మార్పుని అంగీకరించడానికి ప్రయత్నించాను. కానీ అకస్మాత్తుగా జీవితమంతా మారిపోయినట్టు అనిపించింది. బిడ్డ ఆరోగ్యంపై, సంరక్షణపై పూర్తిగా దృష్టి పెట్టాల్సి వచ్చింది," అని ఆమె చెప్పింది."రెండో గర్భధారణ సమయంలో మాత్రం మానసిక స్థితి భిన్నంగా ఉండేది. కొంత గందరగోళంలో పడ్డాను. స్నేహితులు దూరంగా ఉండటం వల్ల మద్దతు లేకుండా అనిపించింది. ఒంటరిగా ఉండడం ఒక సవాలుగా మారింది," అని ఇలియానా వెల్లడించింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.